

# స్వయంకృతం

శ్రీ రావి రామమోహనశాస్త్రి



"డియర్ రామం! నా పరిస్థితులు నీకు తెలియనివి కావు. క్షణం తీరిక కాకుండా సతమతమవుతున్నాను. రాలేకపోయినందుకు మన్నించు. సరోజను నా బదులుగా క్షమాపణలు కోరు. వీలైతే లెటర్ రాయి.

నీ.....ప్రభాకరం."

గట్టిగా నిట్టూర్చాను. ప్రభాకరం నుండీ యిలాంటి ఉత్తరాలు అందుకోవడం నాకు కొత్తకాదు. ఎప్పుడూ యింతే! అయినా ఈవేళ నా మనస్సులో తీవ్రమైన కల్లోలాన్ని రేపింది వాడి, మూడు ముక్కల ఉత్తరం. దేశంలో ప్రభాకరంలా వ్యాపారం చేస్తూ లక్షలార్జిస్తున్న వాళ్ళు అనేకమంది. ప్రభాకరంలాంటి వాళ్ళకే కాదు. ప్రతి వ్యక్తికీ డబ్బు సంపాదించి జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనే ఉంటుంది. ప్రస్తుత ప్రపంచంలో డబ్బు దేవుడి కంటే ఆధిక్యత సంపాదించిందన్నా అతిశయోక్తి ఉండదు. అయితే! ఆ డబ్బుకోసం జీవితంలో సంప్రాప్తమయ్యే మధురాతి మధురమైన అనుభూతులను కాలదన్నుకుంటామా? డబ్బుతో కొనుక్కోలేని అపూర్వానుభవాలను త్యాజ్యాలు చేసుకుంటామా? ఈ చర్చకంటె ముందు ప్రభాకరాన్ని గురించి రెండు ముక్కలు చెప్పడం అవసరం.

ప్రభాకరం చాలా మధ్యతరగతివాడు కాడు. సంపన్నుడు. తల్లిదండ్రులు చిన్నప్పుడె పోయినా పిల్లా జల్లా లేని విధవ మేనత్తగారొకావిడ పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులు నేర్పించింది. పాపం! వాడి పెళ్ళిచేసి తనువు చాలించాలనుకుంది కాని ఆవిడకా యోగ్యతను భగవంతుడు రాయలేదో ఏమో విశ్వనాధంగారి ఏకైక పుత్రిక సరోజను మేనల్లుడికివ్వడానికి ఖాయపరుచుకున్న వెంటనే హృద్రోగంతో కన్ను మూసింది. ప్రభాకరం ఏకాకి అయ్యాడు. నా అనుకునేవాళ్ళు కరువైనా, మేనత్తగారిదీ, తల్లిదండ్రులు వదలి పోయినదీ నాలుగు లక్షల చిల్లర ఆస్తి వాడికి తోడుగా నిలచింది.

సుందరమ్మగారు పోయిన తర్వాత విశ్వ

నాథంగారి పరిస్థితి ఇరకాటాన పడింది. ఆయనకు రక్తపుపోటు. ఆయన భార్య విమలమ్మగారూ రోగిష్టి మనిషే! ఏక్షణాన ఎలాంటి విషమ ఘడియలు సంప్రాప్తమవుతాయోనని వోపక్కా, కూతురిపెళ్ళి తన చేతులమీదుగా చెయ్యగలనో లేనో అని మరోపక్కా బెంగపడిపోయారు. బెంగపడిపోయేందుకు కారణం ఆర్థికంగా వెనుకబడిన వాడేమీ కాదు. అయినా కాలపాశం ఏ క్షణాన లాగివేస్తుందో అని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొన్నట్టున్న జబ్బుమనిషాయె! తను పోయాక పరిస్థితులెలా మారతాయో అని బాధపడుతున్నాడాయన.

ఆ స్థితిలో ఒకరకంగా ఆయన మనశ్శాంతికి దోహదంచేసిన వ్యక్తిని నేను. ఈ సంగతిని నే నెన్నడూ సగర్వంగా చెప్పుకోను. వినయంగా, కృతజ్ఞుడిలా చెప్పుకుంటాను. ఆయన వ్యక్తిగతంగా నాకు చేసిన సాయం అలాటిది. ఈవేళ నేను బి. కామ్. పాసై బాంక్‌లో మూడువందల రూపాయిలు తెచ్చుకుంటూ, ఒక్కగానొక్కడి నైనందుకు మా అమ్మకూ, నాన్నకూ సంతోషాన్ని కలిగిస్తున్నానంటే అందులో నా ప్రయోజకత్వం ఏమీలేదు, విశ్వనాథంగారి చలవ. స్కూలుఫైనలు చదువుకే జీతం కట్టేందుకు నానా అగచాట్లు పడ్డ నాబోటివాడు కాలేజీ చదువులను ఆశించడం ఎలా సంభవం? కాని అనుకోనివిధంగా విశ్వనాథంగారు మా నాన్ననూ, నన్నూ ఒప్పించి తమ కుమార్తె సరోజతోపాటు కాలేజీలో చేర్పించారు నన్ను. అలాటి విశాలహృదయులెక్కడో అరుదుగా కనిపిస్తుంటారు.

నేనే ఆరోజు ప్రభాకరంతో విశ్వనాథంగారి సమస్యాపన్నిగురించి వివరంగా ము. వాడు సన్న ° నవ్వాడు.

"నాకు మా సుందరమ్మత్త మాటను దాటి నడవాలని ఏ కోశానా లేదురా రామం! అయినా సరోజ నాకు నచ్చకపోతేగదా! కాని పెళ్ళికిమాత్రం కొంతకాలం వేచి ఉండక తప్పదు. కూర్చుని తింటె కొండలయినా కరిగిపోతాయంటారు. అందులో నేను లక్షలాది ఆస్తికి యజమానిని. వూరికే కూర్చుంటే నా ఆలోచనలే మూర్ఖాన్ని ఆవహిస్తాయో చెప్పలేను. అందుకే వ్యాపారం చెయ్యాలనుకుంటున్నాను. రామయ్య నాకు కలవలేదుగాని రాజధానిలో బిజినెస్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాను. వచ్చే ఫస్టున మన మకాం అక్కడికి మారుస్తున్నాను. అక్కడ స్థిరత్వం వచ్చేందుకు కనీసం అయిదారు మాసాలు పట్టవచ్చు. అంతవరకూ విశ్వనాథంగార్ని వోపికపట్టమను" అన్నాడు. ఆ మూడు ముళ్ళూ పడ్డాక ప్రారంభించవచ్చుకదా అంటూ అనేక విధాల నచ్చచెప్పడానికి ప్రయత్నించి విఫలుడ్ని అయినాను. చివరకు విధిలేక 'మాట తప్పను' అని వాడిచేత ఒట్టు వేయించుకుని తిరిగొచ్చాను. విశ్వనాథంగారి మనస్సు కాస్త తేలిక పడింది.

సరిగ్గా ప్రభాకరం రాజధానీ నగరానికి వెళ్ళి సంవత్సరం గడిచిపోయింది. ఈ సంవత్సరకాలంలోనూ ఒకసారి విశ్వనాథంగారూ, రెండుమార్లు నేనూ వాడి దగ్గరికి వెళ్ళొచ్చాం. వ్యాపారం నాలుగింతలయింది. డబ్బు సంపాదించటమే వాడి ధ్యేయమైనట్లున్నది పరిస్థితి చూడగా. జీవితానికి సంబంధించిన అతి ప్రధానమైన సమస్యలకంటే డబ్బే వాడికి ముఖ్యమైపోయిందేమోననిపించింది నాకు. వీలు దొరికిన వెంటనే తెలియపరుస్తానన్నమాత్రం వాడి జవాబు.

పక్షం రోజుల క్రిందట అకస్మికంగా విశ్వనాథంగారికి రక్తపుపోటు వచ్చింది. నాకు కబురందిన తక్షణం ఆయన్ని చూచేందుకు వెళ్ళాను. నే వెళ్ళేసరికి అప్పుడే ఇంజక్షనిచ్చిన డాక్టరు వెళ్ళిపోతున్నాడు. నే నడిగిన ప్రశ్నకు "ఫరవా లేదు" అని జవాబిచ్చి వెళ్ళాడాయన.

గదిలో మంచంమీద తెలివితోనే ఉన్నారు, విశ్వనాథంగారు. నన్ను చూచి, "కూర్చోవోయ్" అన్నాడు కుర్చీచూపుతూ.

"ఎలా వుంది??" అనడిగాను.

"ముసలాణ్ణి! అందునా జబ్బు మనిషిని! ఎలా ఉంటాను?" అన్నారాయన పేలవంగా నవ్వుతూ!

నా మనస్సు ఆర్ద్రమైపోయింది. ఆయన వ్యథ నాకు తెలుసు. మానసిక విశ్రాంతి లేని మనిషికి జబ్బేమీ లేకపోయినా జబ్బుపడిన వాడికన్నా బలహీనుడు కావడం సహజం. ప్రత్యేకించి జబ్బు మనిషికి అశాంతి తోడైతే వేరే చెప్పేదేముంది?

"చూడు రామం! అటు చూడు!" అని గుమ్మంవైపు చూపించా రాయన. తల త్రిప్పి చూశాను. గుమ్మంలో విమలమ్మగారూ, సరోజా సజల నేత్రాలతో నిలబడివున్నారు.

"రామం! సరోజను చూశావా, ఎలా అయిపోయిందో! నేను బ్రతికుండగా దాని ముద్దూ ముచ్చటా తీర్చగలనంటావా?" అన్నారాయన, బాధగా.

"మీరలా బాధ పడితే వారికి వోదార్పేది చెప్పండి!" అన్నాను.

"ఇచ్చిన మాట తప్పాలనిలేదు రామం! ఎలా ఉంటుంది? అన్ని విధాలా నాకు నచ్చిన సంబంధం. డబ్బుంది! చదువుంది! అన్నింటిలో సమర్థు డున్నాడు. కూతురి భవిష్యత్తు సుఖమయం చెయ్యాలని నా కోరిక! ఏమో!" అని నిట్టూర్చా రాయన.

"ప్రభాకరం మాట తప్పిపోడని నా దృఢ విశ్వాసం! మీరతన్ని శంకించవలసిన పనిలేదు. నే నీరోజే అతనికి ఉత్తరం రాసి తప్పకుండా వచ్చేట్టు చేస్తాను. అవసరమైతే నేనే వెళ్ళొస్తాను." అన్నాను, ధైర్యం చెప్తూ!

"ప్రయత్నించు రామం! స్వవిషయంగా భావించు" అన్నా రాయన.

"అది నా బాధ్యతండీ!" అంటూ గదిలోంచి హాల్లోకి వచ్చాను. విమలమ్మగారు నిర్లిప్తంగా నావేపు చూసింది. నమస్కరించుకుని మెల్లిగా బైటికి నడిచాను. వీధిగుమ్మం దాటుతూండగా, "రామం" అన్న పిలుపు. వెనుదిరిగి చూశాను. సరోజ!

"రామం! ఈ వేళే ప్రభాకరానికి ఉత్తరం రాస్తానన్నారు!" అనడిగింది సరోజ. ఆమె గొంతు రుద్ధమైవుంది.

"అవును సరోజా!" అన్నాను.

# చెమటకాయలు




'నికో' సబ్బు రుద్దుకొని స్నానము చేస్తే
అది వేదధీర్చి చెమట కాయలనుండి
ఉపశమనము కలిగించును మరియు
అది శరీరదుర్గంధము లేకుండాచేయును

**నికో**

క్రిమిసంహారక సబ్బు

పార్క్-డేవిస్ ఉత్పత్తి

6513 b

మంచి ట్రాన్సిస్టర్ కావాలా?

**మూర్తి & కో.,**

లో చూడండి! ఫోన్ 369

బిసెంటురోడ్డు * విజయవాడ-

బ్రాంచి: హైదరాబాద్

అందరూ జపాన్ సాంకేతిక

సహాయంతో తయారైన

"శాన్యో" 'SANYO'

కొంటున్నారు మీరూ కొనండి

ఉచితము! ఉచితము!!

## తెల్లమచ్చలు

మా ప్రఖ్యాతివహించిన 'డాగ్‌సాఫా' ప్రత్యేక ఔషధం తెల్లమచ్చలను సంపూర్ణముగా పోగొట్టి 1924 సం॥ నుండి ప్రఖ్యాతి పొందుచున్నది కొద్దిరోజుల వాడకంతోనే మచ్చ కొ... ఉచితంగా ఒక సాంపిల్ ... వ్రాయండి

Leucoderma Treatment Centre,
P O Katri Sarai (Gaya)


# స్వయం కృతం

"ఏం రాయిదల్చుకున్నావు?"

"నేనేం రాస్తానో నీకు తెలీదా?"

"తెలుసుకాని, నే నన్నానని రెండు మాటలు రాస్తావా?"

"ఏమిటవి? పోనీ నువ్వే రాయకూడదూ?"

సరోజ క్షణం ఆగి "ఎన్నడూ అలవాటులేనిదీ, మనస్సుకి ఇష్టంలేనిదీ చెయ్యడం నా స్వభావంకాదు రామం! అయినా పరిస్థితులకు మనం బానిసలం! సమస్యలను కాలమే పరిష్కరిస్తుంది!" అంది.

నా కా మాటలో, అర్థంగానిదేమీలేదు అయినా ఏదో నా వూహాకందని భావం ఉన్నదేమో అని సందేహం కలిగింది ఆమె కళ్ళలోకి చూడాలని ప్రయత్నించాను ఆమె మొహాన్ని పక్కకి తిప్పుకుంది

"ఒకానొక నిర్ణయానికి రావడానికి చాలాకాలం పడుతుంది కాని ఆ నిర్ణయానికి వచ్చి కార్యాచరణకు పూనుకునే లోపల పరిస్థితులెలా మారుతాయో చెప్పలేం! కాలం మనకోసం కాచుకోదు రామం! కదూ?" అన్నది

"నిజమేనేమో, సరోజా! ఇప్పుడు నేనా విషయాన్ని గురించి ఆలోచించే స్థితిలో లేను" అన్నాను

"ఆలోచించు రామం! ఆరెండుముక్కలే నావిగా వ్రాయి" అంటూ సరోజ కళ్ళు తుడుచుకుని లోపలికి వెళ్ళిపోయింది

బరువుగా అడుగులువేస్తూ రోడ్డుమీదికి వచ్చాను ఇప్పటివరకూ ప్రభాకరం ఎవర్నను గురించి నాకెటి అనుమానమూ లేదు ఇప్పుడిప్పుడే నా అవ్యక్తమైన సందేహాలు కలుగ సాగినై వాడెందుకిలా తాత్సారం చేస్తున్నాడు? అసలు వాడికి పెళ్ళిచేసుకోవాలని లేదా? లేక సరోజలంటే ఇష్టంలేదా? అదీ కాకపోతే విశ్వనాధంగారు తనను అల్లుడ్నిగా చేసుకొనేంత పెద్ద అంతస్తులో లేరనా? ఇవేవీ కాకపోతే వ్యాపారం, డబ్బు సంపాదనఅనే విషవలయంలో చిక్కుకొని జీవితాన్ని మర్చిపోయాడా? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలు వీటన్నిటినీ పొందుపరిచి సుదీర్ఘమైన లేఖ వ్రాశాను అప్పటికప్పుడే! దానికి జవాబే నేను పైన పేర్కొన్న మూడు ముక్కల ఉత్తరం స్వీయ జీవితమూ దృష్టిలోలేక, పరుల సమస్యలనూ అర్థం చేసుకోలేక, తనను నమ్ముకున్న ఒక అబలనూ అర్థంచేసుకోలేని మూర్ఖుడా ప్రభాకరం! వాణ్ణి నా స్నేహితుడుగా తలుచుకుంటున్నందుకు నాకు నిజంగా సిగ్గేసింది

తప్పకుండా వాణ్ణి రప్పించే ఏర్పాటు చేస్తానని విశ్వనాధం గారికి మాటయిచ్చి ఇప్పుడీ ఉత్తరంతో ఆయనకెలా మొహం చూపించేది? అలా అని మానెయ్యటానికీ వీల్లేని పరిస్థితి అందుకే ఆసాయంత్రమే వారింటికి వెళ్ళాను. హాల్లో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న సరోజ చిరునవ్వుతో ఆహ్వానించింది.

"ఎలావుంది మీనాన్న గారికి?" అనడిగాను.

"పరవాలేదు రామం! అలా షికారుగా వెళ్ళారు కూర్చో!" అంటూ పక్కకుర్చీ చూపించింది థాంక్స్ చెప్పి కుర్చీలో వాలాను.

"ప్రభాకరం నుండి ఉత్తరం వచ్చింది సరోజా!" అన్నాను.

ఆమె మాట్లాడలేదు

"బాధగా వుందా?" అనడిగాను.

"ఎందుకు?" అని ప్రశ్నించింది సరోజ.

తెల్లబోయాను ఆమె తనమనసువిప్పి బాధను చెప్పుకుంటుందని ఆశించి నిరాశ చెందాను

"ప్రభాకరం ఇలాఎందుకు తయారయ్యాడో అర్థంకావడం లేదు సరోజా! వాడివల్ల నీజీవితం నందనవనం కావాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను కాని......" అంటూ ఆగిపోయాను, ఆమె నవ్వువిని

"త్యాగమూర్తివి రామం! నిన్నభినందించవలసిందే! ఇతరుల సుఖ సంతోషాలతో పాటు నిన్ను గురించి నువ్వాలోచించుకోవాలన్న విషయం విస్మరించకు" అని

(46వ పేజీ చూడండి)

# స్వయం కృతం

(12వ పేజీ తరువాయి)

సరోజ చెప్పుతూండగా విశ్వనాథం గారు వచ్చారు.

"రామం! ఎంతసేపైందోయ్‌వచ్చి? ఇప్పుడేముఖ్యమైన పనివుండి మీనాన్న దగ్గిరికే వెళ్తున్నా. తనను తాము తక్కువగా చూసుకునే వాళ్లను దారికి తీసుకు రావడం చాలా కష్టం సుమా!" అంటూ ఆయన సరోజకు పక్కగా వున్న కుర్చీలో కూర్చున్నారు. ఆయన ముఖంలో ఆనంద రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"సరోజా! రెండు గ్లాసులతో మాకు కాఫీలు పట్రా అమ్మా!" అన్నారాయన సరోజతో. సరోజ లేచి లోపలికి వెళ్లింది.

ప్రభాకరం వ్రాసిన ఉత్తరాన్ని గురించి ఎలా చెప్పడమా అని తటపటాయిస్తున్నంత లోనే విశ్వనాథంగారు అన్నారు.

"ప్రభాకరం ఉత్తరం వ్రాశాడురామం! ఇప్పుడే సీజన్ మొదలైందట. తలతిప్పి చూసేందుకూడా వ్యవధిలేదట. ఏప్రిల్,మే ప్రాంతాల్లో వస్తానంటాడు. అతని పద్ధతి నాకేమీ నచ్చలేదోయ్! నామనస్సే మార్చుకున్నాను. సహనానికి కూడా కొన్ని హద్దు లుంటాయి. కాదంటావా?"

సరోజ కాఫీతెస్తోంది లోపల్నుంచి. నామనస్సు పరిపరి విధాల ఆలోచింప సాగింది.

* * *

సాయంత్రం అయిదు గంటలుదాటింది. బాంకువదలి బైటకి వచ్చి పేవ్‌మెంటు మీద మెల్లిగా నడవసాగాను.

"ఒరెయ్ రామం!" అంటూ ఓ ఆకారం గబగబ నన్ను సమీపించింది. అతను ప్రభాకరం!

"ఇన్నాళ్లకు కనిపించిందన్నమాట మా వూరు!" అన్నాను వ్యంగ్యంగా .

"మనవూరనవోయ్! రైలుదిగి సరాసరి ఇక్కడికె వచ్చాను, దొరగారింకా బాంకు లోనే ఉంటారనుకుంటూ. పద! ఇంటికి పోదాం." అంటూ వాడు నాజవాబుకు ఆగ కుండానే వాడికోసం ఆగివున్న రిక్షా వేపు దారితీశాడు. ఇద్దరం రిక్షాలోకూర్చు న్నాం. మాయింటి ముందు రిక్షా ఆగే వరకూవాడేవేవో వ్యాపార విషయాలు చెప్పుతూనే వున్నాడు. అందులో నాకొక్కటి కూడా వినిపించలేదు. నాఆలో చనలు వేరు.

తలుపులు తాళం తీశాను. ఇద్దరం లోపలికి నడిచాం.

"మీ అమ్మా, నాన్న ఏరి?" అడిగాడు ప్రభాకరం గదిలో పడకుర్చీలో వాలుతూ.

"విశ్వనాథంగారింటికి వెళ్ళారు."అన్నాను. వాడికెదురుగా ఉన్న కుర్చీలో కూర్చు న్నాను.

"సరోజ కులాసాగా వుందా?" ప్రభా కరం, ప్రశ్నించాడు.

"లేకేం? హాయిగా వుంది" అన్నాను.

"ఆమెను చాలా క్షోభపెట్టాను బ్రదర్. ఆమెకాదు. ఆమెతల్లిదండ్రుల్ని, చచ్చి పోయిన మాపుందరమ్మత్త ఆత్మనుకూడా బాధపెట్టాను. మూర్ఖుణ్ణి."అంటూ ప్రభా కరం కుర్చీలోంచి లేచి కిటికీ ముందున్న టేబిల్ దగ్గిరికి నడిచాడు. దానిమీదున్న ఆల్బమ్ చేతికి తీసుకున్నాడు.

"సరోజ నన్ను క్షమిస్తుందంటావా?" అన్నాడు నామొహంలోకి చూస్తూ. పశ్చా త్తాపం ధ్వనించింది వాడి స్వరంలో.

మౌనంగా ఉండి పోయాను.

ఆల్బమ్‌చూడకుండానే తిరిగి టేబిల్ మీద పడేసి,"రామం! జీవితంలో డబ్బు కన్న మించింది లేదన్న గుడ్డి నమ్మకంతో బతికాన్రా ఇన్నాళ్ళూ! ఛీ! వెధవబ్రతుకు అదీ ఒక బ్రతుకేనా? లక్షలు సంపాదిం చాను. ఎందుకు? ఏంచేసుకునేందుకు? ప్రపంచంలో నా అన్నవాళ్లు లేరు. ఇంటి కొస్తే ఏమ్మానా—అని పలకరించేదిక్కు లేదు. తలనొప్పి వస్తే—బాధఎక్కడ—అని సాంత్వన పలికేవాళ్ళులేరు." అని ఆగాడు.

వింటూ ఉండిపోయాను.

"సాయంత్రం వేళల్లో అలాపబ్లిక్‌గార్డె న్‌లో కూర్చుంటే నాకనిపించేది—నాదీ ఒకజీవితమేనా—అని. జంటలు జంటలుగా నవ్వుతూ కేరింతాలతో తిరిగే యువతీ యువకులు నాహృదయంలో ఉత్తేజాన్ని రేకెత్తించారు. నాలో నిద్రాణమైపోయిన ఆశలను పునరుజ్జీవింప జేశారు. జీవి తానికి లోటేమిటో చూపించారు. రామం! నాజీవిత భాగస్వామిని కోసం వచ్చాను. సరోజకోసమే వచ్చాను." అన్నాడు ప్రభా కరం , ఆవేశంతో.

నాహృదయం వేగంగా స్పందించింది. అంతలో వీధి తలుపు చప్పుడైంది.

"ఉండు బ్రదర్! ఇప్పుడే వస్తాను......" అంటూ వెళ్లి వీధితలుపు తెరిచాను. ఎదు రుగా నా శ్రీమతి చిరునవ్వుతో నిలబడి వున్నది.

"ఎంతసేపైంది మీరువచ్చి?" అనడి గింది.

"ఒ పావు గంట అవుతుంది. వీళ్లేరి?" అన్నాను.

"కోవెల్లో పురాణానికి వెళ్ళారు. దొర గారు వచ్చి వుంటారని పరుగులతోవచ్చాను" అందావిడ నవ్వుతూ!

"సరేగాని నాస్నేహితుడొకతను వచ్చాడు, మంచి కాఫీచేసి తీసుకొస్తావా?" అనడిగాను.

"చిత్తం!తను ఆజ్ఞ!"అంటూ నా శ్రీమతి వంటగదికేసి వెళింది. వీధితలుపు గడియ పెట్టి తిరిగి గదిలోకి వచ్చాను.

"ఎవర్రా?" అన్నాడు ప్రభాకరం పడ కుర్చీలో వాలి, సిగరెట్టు పొగవదుల్తూ.

"ఇంకెవరు! నా శ్రీమతి!" అన్నాను.

"వాట్! శ్రీమతి! అనగా నీభార్య! ఎంత వాడివిరా! చెప్పకుండా పెళ్లా డేసేవ్? దుర్మార్గుడా!" అనరిచాడు, ప్రభాకరం బిగ్గరగా!

"ఉత్తరాలు వ్రాశాను ప్రభాకరం!నువ్వు చూశావో లేదో! నీకు నీవ్యాపారమూ, డబ్బూ—ఈరెండే ప్రధానం! వాటికోసం నువ్వేం చెయ్యడానికైనా సిద్ధపడున్నా వానాడు. నాఉత్తరాలు చూసే తీరికేది? మాబోటివాళ్ళకు డబ్బుకన్న జీవితమే ఎక్కువ. జీవితసౌభాగ్యంకోసం కానివాళ్లను కూడా మేమే హృదయపూర్వకంగా అభిమా నిస్తాం. నువ్వు డబ్బుకోసం అయిన వాళ్లనూ, నమ్ముకున్నవాళ్లనూ దూరం చేసుకుంటావు. నువ్వు జీవితాలనుండి డబ్బు పిండుకోవాలని చూస్తావు, మేము

సుఖాలను పొందాలని తపిస్తాం. అదే నీకూ, మాకుఉన్న అంతరం. అందుకే మాకు డబ్బుకు దొరకని ప్రేమాభిమానాలు సులభ సాధ్యం. వాటిని డబ్బుతో కొనాలనుకునే నీకు దుర్లభాలు."

"లేదు బ్రదర్! నువ్వు దూషించిన వాడు వేరు. కాని యిప్పుడు నీముందున్న ప్రభాకరం పూర్తిగా మారిపోయాడు. వీడూ ఇప్పుడు మీలాంటి వాడే! విన్నభివంది స్తున్నాను. నీ శ్రీమతిని పరిచయంచెయి. ధన్యుడినవుతాను." అన్నాడు ప్రభాకరం.

"ముందీ ఫోటో ఆల్బమ్ చూడు. అంటూ టేబిల్‌మీది ఆల్బమ్ తీసివాడి కందించాను. అట్టతీయగానే మొట్టమొదటి పేజీలో మాపెళ్ళిఫోటో! అదిచూచి అవాక్కయి పోయాడు, ప్రభాకరం.

"ఏమిటి! సరోజా— నీ శ్రీమతి!" ప్రభాకరం మాటలు తడబడిపోతున్నాయి.

"అవును బ్రదర్! విశ్వనాధంగారిఅమ్మాయి సరోజ! నాభార్య" అన్నాను. నాశరీరమంతా ముచ్చెమటలు పట్టేశాయి.

"ఎంతమోసం చేశావురా! ద్రోహీ!" అనరిచాడు, ప్రభాకరం.


"ఎవరు ద్రోహి?" అని ప్రశ్నించింది సరోజ కాఫీ కప్పులతో గదిలోకి వస్తూ. కప్పులను టేబిల్‌మీద వుంచి తిరిగి వెళ్ళి గుమ్మంవారగా నిలబడింది.

క్షణంపాటు మా యిద్దరివంకా చూసి "మీ యిద్దరూ!" అన్నాడు, ప్రభాకరం.

"మేమెవరికీ ద్రోహం చెయ్యలేదే! ఇందులో ద్రోహం అనే పదానికి అర్థం ముందో లేదో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోండి! చెట్టున కాయపండుతుందని ఆశించాం. కాని అది పండకుండానే ఎండి పోయింది. పండు తినాలన్న ఆకాంక్ష కు పర్యవసానం ఏమిటి?" అన్నదిసరోజ గంభీరంగా.

ప్రభాకరం మాటాడలేదు.

"ఓర్పునిమించా పొద్దు లున్నాయి పొద్దు మీరిన ఓర్పు అనర్ధహేతువు. మనసు ఎదురుతిరుగుతున్నా, అది సంతోషదాయాన్ని కోరుతున్నా, కనిపెంచినవారి సంతోషం కోసం, సంతృప్తికోసం నా ఆశలను చంపు కోవాలనుకున్నాను. అందుకు కూడా మీరు






కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి



**"మేల్ మాయిల్ మందు"**

నల్లరంగు, ఎర్రరంగు పొడలు, దద్దుర్లు, గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు రణములు మొదలగు

*దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి*

— వివరములకు —

సిద్ధ డాక్టర్ కే టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P O.) N A. Dt.



# కుటుంబ నియంత్రణ

## సరిక్రొత్త ప్రచురణ — ఎక్కువ పటములు

**డా॥ కె. సత్యవతి & డా॥ టి. సి. దేవన్** వారిచే రచింపబడినది.

దేవన్ పబ్లికేషన్స్, 27, బాబర్ లేన్, న్యూఢిల్లీ—1.

జనరల్ కరియప్ప ప్రస్తావన, పండిట జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీ కె. ఎం మున్షీ మరియు ఇతరుల ప్రశంసలతో ఈ పుస్తకమున నవీనపద్ధతులు చిత్రపటములతో, వివరించబడినవి. ఇంగ్లీషు, హిందీ, ఉరుదు, తమిళ భాషలలో లభించును. ధర రు. 5/-పుస్తకం తెప్పించుకొని, గ్రంధకర్తలతో సంప్రదించవచ్చును. అడ్రసు: 27, బాబర్ లేన్, న్యూఢిల్లీ-1 లేక 1899, చాందిని చౌక్, ఢిల్లీ-6. ఫోన్ నెం 48646, 77140, 264865.



## నిరాశ చెందవదు

దాంపత్య జీవితంలోని బలహీనతగూర్చి మీరు చింతపడవదు

# జీవన స్పెషల్



రుచియైన ఆయుర్వేదటానిక్. ఉత్తమగుణములుగలది. కోల్పోయినశక్తినిచేకూర్చి దాంపత్య జీవితాన్ని ఆనందమయుల చేస్తుంది. స్త్రీలు ప్రసవానంతరం "జీవన స్పెషల్" సేవించిన, యౌవనులుగా నుందురు.

ఎక్కువ ఫలితానికి :—

...బవాడటం మంచిది — కావలసినంత దేహ వ్యాయామము చేయవలెను — ...డరాదు.

ముఖ్య గమనిక : జీవన స్పెషల్ మీ దేహాన్ని తొందరగా పోషించు శక్తిగలది కాబట్టి ...డు వారములు సేవించిన తర్వాత ఒక వారంరోజులు మానివేయుట ...లా అవసరం. లేనియెడల ...పోదురు. లేక దాంపత్య వాంఛ అధికమగును. ...రోగ్యం, ...చేకూరిన వెంటనే మానివేయవలెను. 450 గ్రాముల ప్యాకింగ్‌లో లభించును ధర రు 10

## అమృత లేపనం (పురుషులకు మాత్రము)

దాంపత్య జీవితములో శీఘ్రమైన లేక జీర్ణించిన అన్ని రకాల బలహీతలకు శక్తినంత ఔషధము. (పై పూతకు మాత్రము) 25 M L.L. సీసా 1 కి ధర రు. 10/- వికరం ...చిత కరపత్రములకు వ్రాయండి ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయవలెను. అన్ని ఆర్డర్లతో సగం ఔషధము ధరలో సగం పంపాలెను. మిగతమొత్తమునకు వి. పి. పి. పంపబడును ప్యాకింగు మరియు ఫార్వర్డింగ్ ఛార్జీలు అదనం. *Orders to:*

**Jeevamritha n Oushadha Sala,**

CALICUT 1.(S. India)

Chief Physician: Dr. K. N. RAMDAS Phone 2419 & 3607

గమనిక . ఆంధ్ర, మధ్యప్రదేశ్ మరియు ఒరిస్సాలలోని అన్ని ముఖ్య పట్టణములకు స్టాకిస్టులు కావలెను. షరతులకు, నిబంధనలకు వ్రాయండి.


# స్వయంకృతం

దోహదం చెయ్యలేదు. ఇందులో మేము ద్రోహం చేసిందేముంది?" అన్నది సరోజ.

"ప్రభాకరం! నన్ను నిందించకురా! విశ్వనాథంగారు నాకు ఎలాంటి మహోపకారం చేశారో నీకు తెలీందికాదు. ఆయన కోరిన మీదట ఆయన మాటను త్రోసిపుచ్చలేక పోయాను. అదీగాక సరోజ ఎన్నాళ్ళగానో నామీద మనస్సు నిలుపుకున్నదన్న విషయం ఆమె నోటిమీదుగానే విన్నప్పుడు స్వార్థమే అను, ద్రోహమే అను, తిరస్కరించటం నాకు చేతకాలేదు." అన్నాను.

ప్రభాకరం కుర్చీలోంచి లేచాడు. మాయిద్దరి వైపూ క్షణకాలం చూశాడు. అతని కనుకొలకుల్లోంచి రెండశ్రుకణాలు జారాయి.

"కాలం నిరంకుశమైనది. మన నిర్ణయాలు నిరాటంకంగా కార్యరూపందాల్చే లోపల పరిణామాలెలా ఉంటాయో ఊహించలేం! నేరం మీదే! మాదికాదు" అన్నది సరోజ.

ప్రభాకరం మౌనంగా, భారంగా అడుగులు వేస్తూ బైట అలుముకుంటున్న చీకట్లోకి సాగిపోయాడు. నేనుగానీ, సరోజగానీ అతన్ని ఆపడానికి ప్రయత్నించలేదు. నాకళ్ళు సజలాలయ్యాయి.

"బాధ పడుతున్నారా?" అనడిగింది సరోజ, లాలనగా.

"వాడి స్థితి తల్చుకుంటే జాలేస్తున్నది. సరూ!" అన్నాను గద్గద స్వరంతో.

"తప్పదు. సృష్టివైచిత్ర్యమే అది. కొందరు బాధల్లో పెరిగి, బాధల్లోనే జీవించి, బాధగానే రాలిపోతారు. మరికొందరు సుఖాల్లో పెరిగి, సుఖాల్లోనే జీవించి సుఖంగానే మరణిస్తారు. ఘూర్కృత్యాలను స్వయంగా కొని తెచ్చుకుని క్రాగి కృశించే వారూ వుంటారు. అలాంటి వారి కోసం రెండు కన్నీటి కణాలు రాల్చడం కంటె చెయ్యగలిగిందేమీలేదు." అంటూ సరోజ కాఫీ కప్పును నా పెదవులకందించింది. నాబుగ్గలమీదున్న కన్నీరును పైటచెంగుతో తుడుస్తూ!